'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని తూర్పు నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మంగళ దాస్ నగర్‌లోని యూపీహెచ్ సీలో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని, జగనన్న ప్రభుత్వంలో గడప గడపకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహాన, వైసీపీ నాయకులు నూర్‌ఖాన్, ఉషా, స్వర్ణ, రామనబోయిన అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లి సెంటర్‌లో ఇస్త్రీ పనిచేసే లింగాల దుర్గా ప్రసాద్ కుమార్తె కీర్తన అనారోగ్యం తో ఉండగా చికిత్స నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని టీడీపీ సీనియర్ నాయకులు జంగాల సాంబశివరావు, తెలుగు యువత గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ గురువారం అందజేశారు. చిన్నారి తండ్రి దుర్గాప్రసాద్ జంగాల సాంబశివరావుకు, వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. దొప్పలపూడి జ్యోతిబాసు, దావులూరి శ్రీనివాసరావు ఉన్నారు.

564 నూతన పెన్షన్లు మంజూరు

విశాలాంధ్ర-తాడేపల్లి : పింఛన్లు పెంపు దల, నూతన పింఛన్లు పంపిణీ కార్య క్రమం గురువారం తాడేపల్లి బైపాస్ శు భమస్తు కళ్యాణ మండపంలో ఎంటీ ఎంసీ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి పాల్గొని నూతన పింఛన్లను, పెరిగిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళా, చేనేత, మత్స్యకార, కల్లు గీత కార్మికులు, చర్మకారులు, హెచ్‌ఐవీ, ఆర్ట్ పింఛన్లు మొత్తం 8 రకాల పింఛన్లు రూ.2750 నుంచి రూ.3 వేలు జనవరి 2024 నుంచి పెంచుతూ వాటిని పింఛన్ లబ్ధిదారులకు అందజేయటం జరిగిందన్నారు. అంతేకాక ఎంటీఎంసీ పరిధిలో సుమారు 564 మందికి నూతన పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, మంగళగిరి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మునగాల భాగ్యలక్ష్మీ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మీ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

– రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినీయల్ అధ్యక్షులు కొమ్మాలపాటి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విద్యతో సరస్వతీదేవిని సాధించగలిగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినీయల్ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన డీఎస్పీ గోలి లక్ష్మయ్య, ప్రధానమంత్రి అవార్డు గ్రహీత ప్రొఫెసర్ శ్రీహరితో విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక హాస్పిటల్ మలినేని లక్ష్మయ్య.. ఇంజనీరింగ్ కాలేజీ ఆయుష్మాన్ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాలకు స్టేషనరీ అందజేశారు. గోలి లక్ష్మయ్య, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో ఇష్టపడి చదువితే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు నల్లపనేని తాండవ కృష్ణ, క్లబ్ ట్రెజరర్ స్రవంత్, మానవతా సెక్రెటరీ రమణబాబు, మలినేని ఇంజనీరింగ్ కాలేజీ పెరుమాళ్, ఆధునిక హాస్పిటల్ డాక్టర్ శిల్పా సింధూరి, డాక్టర్ ప్రత్యూష, ఆయుష్మాన్ తల్లి పిల్లల హాస్పిటల్ అధినేత డాక్టర్ దేవభక్తుని రాకేష్, బోడపాటి ప్రభాకర్, సరిపూడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ విజేతలను అభినందించిన శ్రీచైతన్య యాజమాన్యం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్ఓ(ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్) పరీక్షల్లో బుర్రిపాలెం శ్రీచైతన్య పాఠ శాల 197 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచి రెండవ స్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపల్ లక్ష్మీపతి తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాల ప్రాంగణం నందు అభినందన సభ నిర్వహించారు. అనంతరం శ్రీచైతన్య ఏజీఎం నూతలపాటి అంజయ్య, ఆర్ఐ అప్పాజీ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఐఎన్‌టీఎస్ఓ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుంటారన్నారు. అకాడమిక్ కో-ఆర్డినేటర్ గోపీచంద్, డీన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

గుంటూరు ఈస్ట్ 6వ మండలం అధ్యక్షునిగా సురేష్ జైన్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు తూర్పు బీజేపీ 6వ మండలం అధ్యక్షునిగా సురేష్ జైన్ మరోమారు నియమితులైయ్యారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రకుమార్ సురేష్ జైన్‌కు అందజేశారు. దీంతో తూర్పు నియోజకవర్గంలోని 5వ, 6వ, 7వ డివిజన్ల ప్రజలు, అభిమానుల హర్షం వ్యక్తంచేశారు. వనమా నరేంద్రకుమార్ మాట్లాడుతూ భాజపా 6వ మండలం అధ్యక్షునిగా సురేష్ జైన్ ఎన్నో సమస్యలుపై పోరాటాలు చేశారని అన్నారు. 6వ మండలం అధ్యక్షునిగా ఎన్నికకు సహకరించిన వనమా నరేంద్రకుమార్‌కు, తూర్పు కన్వీనర్ డాక్టర్ ఉమా శంకర్, తూర్పు కో-కన్వీనర్ షేక్ రఫీకి, శ్రీధర్, యడ్లపాటి స్వరూపరాణి, నాయకులకు సురేష్ జైన్ ధన్యావాదాలు తెలిపారు.

నూతలపాటి వీర ప్రకాశరావుకు విశిష్ట పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరుకార్పొరేషన్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో రాజమహేంద్ర వరంలోని రాజరాజ నరేంద్ర కళావేదికపై ఈనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటలకు వివిధ రంగాలలో విస్తృత సేవలు అందించిన ప్రముఖులకు విశిష్ట పురస్కారాల ప్రధాన కార్యక్రమం జరగనున్నది. గుంటూరుకు చెందిన ప్రముఖ రోటరీయన్ సేవా రంగ ధీరుడు, దివ్యాంగుల ప్రదాత, పేద ప్రజల ఆశాజ్యోతి నూతల పాటి వీర ప్రకాశరావు సేవా రంగంలో ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు. ఈ పురస్కార కార్యక్రమాలకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరుకారున్నారు. చిన్ననాటి నుంచే కాకుండా ఉద్యోగ విధులు ముగిసిన తరువాత కూడా ఇప్పటివరకు లెక్కకు మించిన సేవా కార్యక్రమాలు చేసి గుంటూరు ప్రజలకు అత్యంత చేరువైన వీరప్రకాశరావుకు ఈతరహా పురస్కారం లభించడం గుంటూరు వాసులు గర్వించదగ్గ విషయం.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

– జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు, వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల (ఏఐటీయూసీ) జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని మున్సిపల్ కార్యాల యం ఎదురుగా కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెను గురువారం జంగాల అజయ్ కుమార్ ప్రారంభించారు. కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లా డుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని గత అనేక సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికులు ఆందోళన చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తా మని మాట ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే మాట తప్పి మడమ తిప్పారని విమర్శించారు. దీంతో చేసేది లేక మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళ్ళాల్సి వచ్చిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మెతో వీధులన్నీ దుర్గంధపూరితంగా మారాయన్నారు. ఈ సమ్మె మరో నాలుగు రోజులు కొనసాగితే ప్రజలు తీవ్రమైన అసౌకర్యానికి గురిఅవుతారని చెప్పారు. దీంతో రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు నెలకొంటా యని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కారణం అవుతారని స్పష్టం చేశారు. తక్షణమే యూనియన్ నాయకులను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. లేని పక్షంలో సమ్మె మరింత తీవ్రతరం అవుతుందని, రానున్న ఎన్నికలలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమని హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బందెల రవికుమార్, కోట మాల్యాద్రిలు మాట్లాడుతూ గుంటూరు నగరంలో మున్సిపల్ కార్మికుల సమ్మె విజయవంతంగా జరుగుతోందని, నగరంలో 2 వేల మంది కార్మికులు ఉండగా మొదటి రోజు కేవలం 151 మంది మాత్రమే పనిచేశారని, రెండవ రోజు వారు కూడా సమ్మెలోకి రావడం జరిగిందని చెప్పారు. ఇంజనీరింగ్ విభాగంలో కొంతవరకు సమ్మెలో పాల్గొన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేయాలని, మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా కార్మికుల బాధలను గుర్తించి సమ్మెకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యనారా యణ, సీపీఐ నాయకులు కొల్లి రంగారెడ్డి, ఏపీ మున్సి పల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోటి వీరాంజనే యులు తదితరులు పాల్గొన్నారు.

దివాలా తీసిన బైజూస్‌తో విద్యా వ్యాపారామా?

– ప్రభుత్వం తక్షణమే ఒప్పందం రద్దు చేసుకోవాలి

– బైజూస్ కోచింగ్ సెంటర్ వద్ద ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆందోళన

విశాలాంధ్ర-గుంటూరు : దివాలా తీసిన బైజూస్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఎలా ఒప్పందం చేసుకుంటుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్ ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాలను అస్తవ్యస్తం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం బైజూస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. బైజూస్‌తో ఒప్పందానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా గుంటూరులోని బైజూస్ ఆకాష్ కోచింగ్ సెంటర్ వద్ద ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ అధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఎస్ఎఫ్, వైఎఫ్ నాయకులను అరెస్టు చేసి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రూ.3,500 కోట్ల ప్రజాధనాన్ని బైజూస్‌కు అప్పజెప్పడానికి రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌ల పేరుతో ఒప్పందం చేసుకుందని గుర్తుచేశారు. దీని ద్వారా సబ్జెక్టు అర్థంకాని వారికి బైజూస్ రాష్ట్రవ్యాప్తంగా ట్యూషన్ పాయింట్‌లు ఏర్పాటు చేసిందని చెప్పారు. దీనిలో చేరే ప్రతి విద్యార్థి నుంచి రూ.15 వేలు కట్టించుకొని అడ్మిషన్ చేసుకున్నారని తెలిపారు. ఎవరైనా ఒక నెల తర్వాత తరగతులు వద్దనుకుంటే వారి ఫీజులు మొత్తం వాపసు చేస్తామని బైజూస్ ప్రతినిధులు తల్లిదండ్రులకు చెబుతున్నారన్నారు. ఎవరైనా తల్లిదండ్రులు ఒకేసారి రూ.60 వేలు ఫీజులు చెల్లించలేనప్పుడు బజాజ్ ఫైనాన్స్ ద్వారా ఈఎంఐ రూపంలో ప్రతినెల రూ.5 వేల నుంచి రూ.6 వేలకు వరకు కట్టుకునే సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. దివాలా తీసిన బైజూస్ సంస్థను గట్టెక్కించడానికి ప్రభుత్వం దగ్గరుండి విద్యా వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోందని విమర్శించారు. బైజూస్ దేశంలో ఆర్థికంగా దివాలా తీసిన సంస్థ అని, ఇప్పటికే బైజూస్ మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీ లాండరింగ్ కేసులు కూడా నమోదు చేసినట్లు గుర్తు చేశారు. అటువంటి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ట్యాబ్‌ల పేరుతో కోట్లాది రూపాయలు ప్రజల డబ్బును దోచుకుంటూ... ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న బైజూస్‌కు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక అరాచకాలకు పాల్పడుతున్న బైజూస్ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకోవాలని, ఆ సంస్థను రాష్టంలో నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఎం.కిరణ్‌లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికుల జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఆంధ్ర ప్రదేశ్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావులు సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం మున్సిపల్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుంటే ప్రభుత్వం కనీసం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. ఎన్నికలకు ముందు సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత కనీసం దాని ఊసే ఎత్తడం లేదని అన్నారు. నందం బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకో కుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని మండిపడ్డారు. తాడిశెట్టి శ్రీనివాసరావు, హరిబాబు, దుపటి రాయుడు, ముద్రబోయిన కృష్ణ, వెల్బురి తులసీదాస్, కూరగంటి సుకన్య, వడ్డంటే లక్ష్మి, గుర్రం నరసింహారావు, దనేలు కోటేశ్వరరావు, అప్పారావు, కృష్ణ, నరసయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల రాష్ట్రవ్యాప్త సమ్మె

విశాలాంధ్ర-తెనాలి : మున్సిపల్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె పదవరోజుకు చేరింది. ఈ సందర్భంగా గురువారం తెనాలి మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి పుర వేదిక గంగానమ్మ గుడి రోడ్డు, బెల్లపు కొట్లు బజారు మీదుగా అర్ధనగ్నంగా ప్రదర్శన నిర్వ హించారు. ముఖ్య మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, కనీస పెన్షన్ ఇతర సౌకర్యాలు కల్పించాలని, కార్మికుల సంఖ్య పెంచాలని ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగళగిరి యూనియన్ గౌరవఅధ్యక్షులు షేక్ హుస్సేన్‌వలి మాట్లాడుతూ కార్మికుల తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే కొంతమంది మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, కొందరు అధికారులు కార్మికులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని ఘర్షణ వాతావరణాన్ని కల్పిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.నాగరాజు, మణికంఠ, కొండయ్య, అంజి, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈ నెల 6న రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు స్థానిక బ్రాడీపేటలో ఉన్న బాలానంద కేంద్రంలో 'స్థిరాస్తి హక్కు చట్టం వరమా? శాపమా? అనే అంశంపై రౌండ్ టేబుల్ సమా వేశం జరగబోతుందని రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి గురుదత్, అవధానుల హరి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ టి.సేవకుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంవీ రాజారామ్ ప్రధాన వక్తగా పాల్గొంటారని, వివిధ రంగాల నిపుణులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

వెస్ట్‌లో వైసీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం

– కార్పొరేటర్లు, డివిజన్ నాయకులతో మంత్రి విడదల రజిని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎగురవేయడమే లక్ష్యంగా తనను సీఎం జగన్ పంపారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఈ నేపథ్యంలో వైసీపీ శ్రేణులందరూ ఎన్నికలకు సమాయత్తంగా ఉండాలని సూచించారు. నియోజక వర్గంలో పరిధిలోని ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులతో గురువారం స్థానిక చంద్రమౌళి నగర్‌లో ఉన్న పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాటు కొనసాగిన జగనన్న పరిపాలనలో రాష్ట్ర ప్రజలందిరికీ వెల్లువలా సంక్షేమ ఫలాలు అందాయని, ఆదర్శవంతమైన పాలనే తిరిగి మళ్ళీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మన బలం సీఎం జగనేనని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి డివిజన్ల వారీగా పూర్తి స్థాయిలో పర్యటనలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో చిన్నచిన్న విభేదాలు ఏవైనా ఉంటే పక్కన పెట్టి కలిసి మెలసి పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. జగనన్న గెలిస్తే ఈ రాష్ట్రంలోని పేదలందరూ గెలిచినట్లేనని అన్నారు. మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో తెదేపాకు ఓటమి భయం పట్టుకుందని, దీంతో వైసీపీ కార్యాలయంపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టీడీపీ ఆగడాలను ధీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన జేసీ రాజకుమారి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్, గుంటూరు జిల్లా గ్రంథా లయ సంస్థ పర్సనల్ ఇన్‌ఛార్జ్ రాజకుమారి గనియా స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న మహిళా బాలల గ్రంథాలయాన్ని గురు వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలో గ్రూప్-1, గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో లభిస్తున్న మౌలిక అవసరాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాజకుమారి గనియా మాట్లాడుతూ విద్యార్థులకు అవసర మయ్యే అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచా లని గ్రంథాలయ సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులు ఏవైనా పుస్తకాలు కోరినట్లయితే వెంటనే గ్రంథాలయా నికి సరఫరా చేస్తామని చెప్పారు. విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లైబ్రేరియన్ బి. శకుంతల మాట్లాడుతూ బృందావన గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయం శుక్రవారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థుల సౌకర్యార్థం తెరువబడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్స్ టి.సత్య శిరీష, పి.సుధాకర్, పి.కోటేశ్వరి ఉన్నారు.

అంగన్‌వాడీలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాలలో అంగన్‌వాడీ సమ్మె 24వ రోజు గురు వారం కొనసాగింది. ఈ సమ్మె శిబిరంలో ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్య క్షులు మన్నవ నాగమల్లేశ్వ రరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల ఉపాధ్యక్షులు జట్టి బాలరాజు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇన్నోవేటివ్ భారత్ ఐఐసీ రీజనల్ మీట్ పోస్టర్ విడుదల

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఈ నెల 6న జరగనున్న ఇన్నోవేటివ్ భారత్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సదస్సు పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్ తాడేపల్లిలోని తన కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కేఎల్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ డైరెక్టర్ డాక్టర్ కె.నరసింహరాజు మాట్లాడుతూ కేఎల్ డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్ విభాగం, సీఐఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్ ముఖ్యఅతిథిగా హాజరవుతుండగా, కేంద్ర నూతన ఆవిష్కరణల విద్యా విభాగ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దీపన్ సాహూ, ఏఐసీటీ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుబ్బారావు, సలహాదారు డాక్టర్ రాఘబ్ దాష్‌లు గౌరవ అతిథులుగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిశ్రమలను, స్టార్టప్‌లను ఎంతగానో ప్రోత్సహిస్తు న్నారని, అందులో బాగంగా ఐఐసీ విజయవాడ ప్రాంతీయ సదస్సును కేఎల్ వర్సిటీలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమితోనే రాజ్యాంగానికి, ప్రజలకు రక్షణ

– కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

విశాలాంధ్ర-గుంటూరు : బీజేపీ పాలనలో భారత రాజ్యాంగానికి పెనుముప్పు రాబోతుందని ఈ తరుణంలో ఇండియా కూటమితోనే రాజ్యాంగానికి, ప్రజలకు రక్షణ ఉంటుందని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో గుంటూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమాలోచన సమావేశం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేడీ శీలం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు, బలహీన వర్గాల హక్కులను పరిరక్షించేందుకు ఇండియా కుటామికి అండగా నిలిచి గెలిపించుకోవలసిన చారిత్రాత్మక ఆవశ్యకత ఉందని అన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు మూడు బీజేపీని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ బలపరచడం రాష్టానికి తీరని ద్రోహం చేయటమేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇండియా కూటమిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. ప్రజల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును సమావేశంలో పలు సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రసంగించారు. రామ్ నాయక్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఛైర్మన్ సాకే శంకర్, ఎస్టీ సెల్ ఛైర్మన్ పాచిపెంట శాంతకుమారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లామ్ తాంతియా కుమారి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, వణుకూరి శ్రీనివాస్ రెడ్డి, మద్ది జగన్‌మోహన్ రెడ్డి, సాంబశివరావు, జయసుధ, నాగలక్ష్మి, రామకృష్ణ, బషీర్, చంద్ర నాయక్, తస్నీరు సాంబయ్య, కుమ్మరి క్రాంతి కుమార్, చిష్టి బాషా, నాగ మల్లేశ్వరరావు, అంబటి రత్తయ్య, సలీం, చిలక విజయ్, కరీం, కట్టా జవహర్ బాబు, చుక్కా చంద్రపాల్, సయ్యద్ జాని గోల్డ్, భాగ్యరాజ్, మోషే, మల్లవరపు చిన్న, చిన్ని కోటి, నాగదుర్గ, గౌసియ, అహ్మద్ బాషా, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

వృద్ధుల్లో పరపతి పెంచిన జగన్మోహనరెడ్డి

విశాలాంధ్ర-తెనాలి : గురువారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పెరిగిన ఆసరా పింఛన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో తెనాలి శాసనసభ్యులు అన్నా బత్తుని శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోయినా (వాస్తవంగా వారికి నేడు కూడ పడలేదు) అసరా పింఛన్ దారులకు మాత్రం ఠంచన్‌గా 1వ తేదీన ఉదయమే పెంపుడు కొడుకు జనగ్ ఇస్తున్నాడని అన్నారు. గతంలో వయో పరిమితి వయస్సు 65ను 60కు కుదించి లబ్దిదారుల సంఖ్య నియోజకవర్గంలో 21వేలున్న లబ్దిదారులు 37వేలుకు తమ ప్రభుత్వం పెంచిందన్నారు. పొలం కౌలు రైతు సంవత్సరానికి కౌలు 25వేలుంటే జగన్ 36వేలిస్తున్నాడని కొనియాడారు. వయోవృద్ధులు కడు దీనస్థితిలో జీవిత చరమాంకంలో ఉండి వీఆర్ఓ చేత పంచేవారు. వారి దగ్గరకే వచ్చేవారు కాదు. ఇవాళ రామకృష్ణకవి కళాక్షేత్రంలో పింఛన్ తీసుకునే వారి టువీలర్స్‌తో నిండింది. జగన్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సహాయసహకారాలు అందిస్తుందని చెప్పారు. అనంతరం పింఛన్‌దారులకు నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధికారమేష్, కమీషనర్ యం.జశ్వంతరావు, వైస్‌ఛైర్మన్ ఎ.నాగమణి, గుంటూరు కోటేశ్వరరావు ప్రభృతులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రధాత లూయి బ్రైయిలీ

– సంయుక్త కలెక్టర్ రాజకుమారి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అంధులు విద్యను అభ్యసించటానికి ప్రత్యేక లిపిని రూపొందించిన లూయి బ్రైయిలీ స్ఫూర్తి ప్రధాతా అని, చరిత్రలో చిరస్మరణీయుడు అని జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి కొనియాడారు. గురువారం స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల వసతి గృహ అవరణలో సర్ లూయి బ్రైయిలీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ టీ లీలావతి, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణ వేణి, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కె స్వాతితో కలసి పాల్గొన్నారు. అవరణలో ఉన్న సర్ లూయి బ్రెయిలీ విగ్రహానికి, చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సభలో సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు తోడ్పాటు అందించటానికి అవసరమైన అన్ని కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తు పూర్తి స్థాయిలో సహాయసహకారాలు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త, కార్పొరేటర్ పద్మశ్రీ, దివ్యాంగుల సంక్షేమ సంఘాల నాయకులు హనుమంత రావు, రామకృష్ణ రెడ్డి, సుబ్బారావు, గుమ్మడి సుబ్బారావులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ బాధితులకు చట్ట ప్రకారం కలెక్టర్ న్యాయం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎస్సీ ఎస్టీ చట్టాన్ని నీరు కారుస్తూ దళిత బాధితులను జీవోల అమలను నిర్లక్ష్యం చేస్తూ దళిత నాయకులపై ఉపా చట్టం కింద కేసులు పెడుతున్న జిల్లా కలెక్టర్‌ను తక్షణమే బదిలీ చేసి సాంఘిక బహిష్కరణ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ పెదగొట్టి పాడు, అంబేద్కర్ ఇద్వా మహానగర్, కొర్నెపాడు, యనమదల, పత్తిపాడు గ్రామాలకు చెందిన అత్యాచార బాధిత దళిత మహిళలు గురువారం స్థానిక మార్కెట్ సెంటర్ నుండి స్టాల్ గర్ల్స్ హైస్కూల్ వరకు భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 దాడితో పాటు సాంఘిక బహిష్కరణకు గురైన పెదగొట్టిపాడు ఎస్సీల సంఘటనలో కోర్టు ప్రమేయంతో ఎస్సీ ఎస్టీ చట్టం కేసు నమోదు అయితే ఆ కేసులో విచారణ పూర్తికాకుండానే కోర్టుల విచారణ పూర్తికాక మునుపే జిల్లా కలెక్టర్ కోర్ట్ ప్రొసీజర్‌కు వ్యతిరేకంగా సమాంతర విచారణ జరిపి సాంఘిక బహిష్కరణ జరగలేదంటూ బాధితులకు లేఖలో రాయటం అన్యాయమని పేర్కొన్నారు. హైకోర్టు గ్రామాన్ని రూల్ నెంబర్ 12 ప్రకారం సందర్శించి బాధితులు చెప్పేదాన్ని పరిగణలోని తీసుకొని జీవో 95 ప్రకారం చర్యలు తీసుకోవాలనే కోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా, విచారణ జరిపి బాధితులకు అన్యాయం చేశారని బాధిత కమిటీ నాయకులు ఆరోపించారు. భూసి మౌనిక, కొచ్చర్ల మార్తమ్మ, బుసి జ్ఞానమ్మ, బేతపూడి భారతి, చింతలపూడి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఆహారం దివ్యౌషదం

విశాలాంధ్ర-గుంటూరు : సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటలను మానవాళి ఆహారంగా తీసుకుంటే అవి దివ్యౌషధంగా పనిచేస్తాయని సహస్ర క్రాప్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.శ్రీరామ రెడ్డి అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సహస్ర క్రాప్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో 'ఎంపవరింగ్ ఫార్మర్స్ ఆన్ ఆర్గానిక్ ఎన్‌రిచ్‌మెంట్ ఫర్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ క్రాప్స్(ఈఎఫ్‌వోఈ ఏహెచ్‌సీ)' అనే అంశంపై రైతులకు అవేర్‌నెస్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఆర్గానిక్ పంటలపై జరిగిన ఈ అవగాహన కార్యక్రమానికి యూనివర్సిటీ దత్తగ్రామాలైన వేజండ్ల, వడ్లమూడి, సుద్దపల్లి గ్రామాల నుంచి రైతులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎన్.శ్రీరామ రెడ్డి మాట్లా డుతూ రసాయనాలు వినియోగించకుండా పూర్తిగా సేంద్రియ ప్రకృతి వ్యవ సాయ పద్ధతుల్లో కూరగాయలు, పండ్లు, తిండి గింజలు, పప్పు ధాన్యాలు సాగు చేయడానికి అదనంగా శ్రమపడాల్సి వస్తుందన్నారు. అయితే ఆ శ్రమ వృథాగా పోదన్నారు. సేంద్రియ ఆహారోత్పత్తులలో స్థూల, సూక్ష్మ పోషకాలతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే 'యాంటీ ఆక్సిడెంట్స్' వంటి విశిష్ట పోషకాలు అత్యధిక మోతాదులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు భావితరాలకు మార్గదర్శకుడు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు భావి తరాలకు మార్గదర్శకుడని, ఆయనతోనే నవ్యాంధ్రకు బంగారు భవిష్యత్తు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర, జనసేన పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, పరిసిలకులు సింహాద్రి కనకాచారి పేర్కొనారు. గురువారం 49వ డివిజన్ అధ్యక్షుడు తెలగతోటి సుధీర్ అధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహంచారు. టీడీపీ, జనసేన నాయకులు కలసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా జగనమోహనరెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వవైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగడుతూనే తెలుగుదేశం పార్టీ బ లోపేతానికి ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో మార్క్, సతీష్, వినోద్, అనుపమ, పవన్ వెంకి, గుండాల శ్రీను, నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి

విశాలాంధ్ర-ఈపూరు : క్రీడాకారులు జీవితంలో క్రీడా స్ఫూర్తిని చాటాలని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో బీపీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న తమ కళాశాల విద్యార్థి యామర్తి శ్రీనివాస్ ఈ నెల 3వ తేదిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాల క్రికెట్ పోటీలలో యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు గురువారం తెలిపారు. క్రికెట్ జట్టుకు ఎంపికైన తమ కళాశాల విద్యార్థి శ్రీనివాసులు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, సిహెచ్ అరవింద్, కె.వంశీ చైతన్య, ఎం.దాసు తదితరులు అభినందించారు.

పలు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని ఉంగుటూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం (రూ.40 లక్షలు), హెల్త్ వెల్నెస్ సెంటర్ (రూ.17.5 లక్షలు), రైతు భరోసా కేంద్రం(రూ.21.75 లక్షలు) పనులను గురువారం పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15 రోజులలో పనులు మొత్తం పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-శావల్యాపురం: జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హని క్రిస్టినా సహాయ సహకారాలతో మండలంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ను పంపిణీ చేస్తున్నట్లు ఈపూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కారుమంచి జడ్పీ పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు యార్డ్ చైర్మన్ చేతుల మీదగా పంపిణీ చేశారు. అదేవిధంగా శావల్యాపురం జడ్పీ పాఠశాలలో సర్పంచ్ చెన్నమ్మ చేతుల మీదగా విద్యా జ్యోతి పుస్తకాలను, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాబురావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, హెచ్ఎంలు ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి, మాజీ ఎంపిటిసి చిట్టెటి రవి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు మారుతివరప్రసాద్ సంఘీభావం

విశాలాంధ్ర-నరసరావుపేట : మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వెంటనే పరిష్కరించాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వారు జరుపుతున్న సమ్మెకు సీపీఐ పల్నాడు జిల్లా సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ తెలిపారు. నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్న కార్మికులను కలిసి మాట్లాడిన ఆయన మద్దతును తెలియజేస్తూ న్యాయమైన మీ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు, సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ను అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి మున్సిపల్ కార్మికుల పై వ్యక్తం చేసిన ఆగ్రహాన్ని ఆయన తిప్పికొట్టారు కార్మికుల టెంట్లను కిరాయి మూకల చేత తొలగించటం దుర్మార్గమైన చర్య అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సమ్మె కార్మికుల హక్కు అని, పోరాడనిదే వారి సమస్యలు ఏనాడు పరిష్కారం కాలేదని అంతిమంగా సమస్యల పరిష్కారమే ఏకైక మార్గమని ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టి సమ్మెను విరమింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, జక్రం డేవిడ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పెంపుతో అవ్వాతాతలకు పండుగ

విశాలాంధ్ర-పెదకూరపాడు : అవ్వాతాతలకు అండగా నిలబడిన సీఎం జగన్ పెన్షన్లు రూ.3 వేలకు పెంచారని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. దాంతో అవ్వాతాతలకు అసలైన పండుగ వచ్చిందన్నారు. రూ.3 వేలకు పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుకను పెదకూరపాడులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు లబ్దిదారులకు అందజేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి స్వయంగా పెంచిన పెన్షన్‌ను అందజేశారు. సీఎం జగన్ పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచారని తెలియజేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మాట తప్పకుండా మడమ తిప్పకుండా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల గుండెల్లో దేవుడిగా మారారన్నారు. పెదకూరపాడు పరిధిలో 2019లో కేవలం 1253 మందికి రూ.12.53 లక్షల పెన్షన్ అందేదని.. కానీ ఇప్పుడు 1967 మందికి ప్రతి నెలా రూ.48.63 లక్షలు పెన్షన్ రూపంలో అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈ.సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జడ్పీటీసీ సభ్యులు కంకణాల స్వర్ణకుమారి శివాజీ, షరీఫ్, మాగులూరి అనిల్ కుమార్, శ్రీనివాసరెడ్డి, భాష, రఫీ, అచ్యుతరావు, వెంకట్రావు, బి.హనుమంతరావు, కోటేశ్వరరావు, రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

6న పాటిబండ్ల ముగ్గురు రాజుల తిరునాళ్ళ

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఈ నెల 6న మండల పరిధిలోని పాటిబండ్ల గ్రామంలో ముగ్గురు రాజుల తిరుణాళ్ళ మహోత్సవం జరుగుతున్నట్లు ఆర్సీఎం చర్చి ఫాదర్లు కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్సీఎం మాజీ పీఠాధిపతిలు గాలిబా స్థానిక శాసనసభ్యులు నంబూరు శంకరావు, వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి 200 మంది ఫాదర్లు వంద మంది మత కన్యలు పాల్గొన్నట్లు తెలిపారు. వివిధ సంస్కృతి కార్యక్రమాలు ఆర్సీఎం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు, కొవ్వొత్తుల ప్రదర్శన రథోత్సవం భక్తిశ్రద్ధలతో తిరుణాళ్ళ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలిపారు.

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లా నరసరావుపేటలో గాంధీ పార్క్ వద్ద అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో గత 24 రోజుల నుంచి జరుగుతున్న సమ్మెకు పారా లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ అధినేత డాక్టర్ పి.లక్ష్మయ్య తన మద్దతుని, సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు.

మున్సిపల్ కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్.

విశాలాంధ్ర వినుకొండ : మున్సిపల్ ఆప్కాబ్‌లోని కాంట్రాక్టు మరియు పర్మినెంట్ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కార్మికులు చేస్తున్న సమ్మెను విరమింప చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త మున్సిపల్ కార్మికుల రెండవ రోజు సమ్మెలో భాగంగా గురువారం వినుకొండ పట్టణంలో కార్మికులు విధులను పూర్తిగా బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమ్మె దీక్ష శిబిరం నుండి శివయ్య స్తూపం, ఆర్టీసీ బస్టాండ్, సురేష్ మహల్ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్ మీదుగా మరల మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికుల ప్రదర్శన కొనసాగింది. ప్రదర్శనలో కార్మికులు వారి సమస్యలను గొంతెత్తి నినదించారు వారి ఉద్యమానికి ప్రజలను మద్దతు తెలుపవల సిందిగా కోరుతూ వారి ప్రదర్శన పట్టణంలో కొనసాగింది. ఈ ప్రదర్శనసుద్దేశించి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలప్పుడు కార్మికులకు ఇచ్చిన హామీలు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని, కనీస వేతనాన్ని చట్టం ప్రకారం అమలు చేస్తానని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం కల్పిస్తానని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మి కుల కోరుతున్నారని కార్మికులకు సమ్మె చేయాలని ఆలోచన లేదని ప్రభుత్వ అధికారులు మంత్రులు చర్చల పేరిట కాలయాపన చేసి కార్మికులను అసహనానికి గురి చేశారని సమస్యలు పరిష్కారం కానుందున అనివార్యంగా సమ్మెలోకి వెళ్లారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం భేషజాలకు పోకుండా మున్సిపాలిటీలలోని అన్ని రంగాలలో పనిచేయుచున్న ఇంజనీరింగ్, ఎలక్ట్రిసిటీ, వాటర్ వర్క్స్, బోర్ ఆపరేటర్స్, పార్కు వర్కర్స్, ట్రాక్టర్ అండ్ ఆటో ట్రాలీ డ్రైవర్స్, ఆఫీస్ సిబ్బంది తదితర కార్మికులకు సుప్రీంకోర్టు చెప్పిన ప్రకారం 26 వేల రూపాయలు కనీస వేతనాలు అమలు జరపాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటియుసి వినుకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ రంగంలో పనిచేయుచున్న అన్ని వర్గాల కార్మికులకు కనీస వేతనాలు అమలు జరపాలని ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని దేశంలో అత్యంత దయనీయమైన ఉద్యోగవృత్తులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు కరోనా సమయంలో కూడా ప్రాణాలకు తెగించి ప్రజల కోసం పట్టణాల పారిశుద్ధ్య బాధ్యత నిర్వహించారని కరోనాలో మరణించిన వారికి 50 లక్షల రూపాయలు ఇస్తానన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆ మాటలు మరిచిపోయారని 200 మంది పైబడి మున్సిపల్ రంగంలో కార్మికులు కరోనాలో చనిపోతే వారికి ఇంతవరకు ఎలాంటి ఎక్స్‌గ్రేషియో చెల్లించలేదని విమర్శించారు. మంత్రులు అధికారులు కార్మిక నాయకులను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటియుసి నాయకులు బూదాల చిన్న, కే. మల్లికార్జునరావు, కార్మిక నేతలు సంపెంగుల రాజు, పచ్చి గొర్ల ఏసు, రాచపూడి ఏసు పాదం, కంచర్ల కోటేశ్వరరావు, వెంకయ్య, గురమ్మ, దేవమ్మ, మార్తమ్మ, నాగరాణి, రాణి, ట్రాక్టర్ ఆటో డ్రైవర్లు కార్మికుల ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర వినుకొండ : స్థానిక శివయ్య భవనంలోని రైతు సంఘం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం రైతులతో సమావేశం అవ్వటం జరిగింది. ఈనెల 8, 9 ,10 వ తేదీల్లో జరుగు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 18వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం వినుకొండ అధ్యక్షులు వెనిగళ్ళ బాలాజీ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ రాజమండ్రిలో మూడు రోజులపాటు జరుగు ఈ మహాసభలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని రాష్ట్రంలో రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నిటిపై ఈ మహాసభల్లో అన్ని జిల్లాల రైతాంగ ప్రతినిధులతో చర్చించి రైతులకు మేలు జరిగే అంశాలను ఈ మహాసభల్లో తీర్మానాలు చేయడం జరుగుతుందని వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి అందే విధంగా చూడటం జరుగుతుందని రైతు ఆత్మహత్యలను నివారించుటకు రైతులకు లాభసాటి వ్యవసాయం గురించి ఏ విధంగా ముందుకు పోవాలనేది రైతాంగ ప్రతినిధులు శాస్త్రవేత్తలు ఈ మహాసభలో తగు సూచనలు కూడా ఇవ్వటం జరుగుతుందని ఈ మహాసభలు జయప్రదం చేయాలని రాము పలనాడు జిల్లా రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతు నాయకులు వెనిగళ్ళ బాలాజీ, పిన్ని బోయిన వెంకటేశ్వర్లు, మద్దికుంట అంకుల్ షేక్ దాదా, పోట్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సీపీఐ సంపూర్ణ మద్దతు

24వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె,

విశాలాంధ్ర వినుకొండ : అంగన్వాడీల సమస్య పరిష్కారం అయ్యేవరకు సీపీఐ సంపూర్ణ మద్దతును సహకారం అందిస్తుందని పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. గత 24 రోజు లుగా జరుగుతున్న అంగన్వాడీల శిబిరాన్ని సందర్శించిన ఆయన పట్టణంలో సమ్మె నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు అంగన్వాడీల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు తెలియ జేస్తున్నామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్క చెల్లెమ్మలంటూ మహిళలను, నా కార్మిక సోదరులంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికులను వారి సమస్యలు పరిష్కారం చేయకుండా సమ్మెలోకి దించి రోడ్లమీదకి పంపారని పైగా తమ ఎమ్మెల్యేలతో సమ్మెలో ఉన్న అంగన్వాడీలు మున్సిపల్ కార్మికులపై దౌర్జన్యాలకు దిగుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇది తగదని ఎర్రజెండా నీడలో కార్మికుల హక్కుల కోసం పోరాడే మహిళలు కార్మికులు ఇటువంటి బెదిరింపులకు భయపడరని ప్రధానంగా వారి సమస్యలైన సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు చెప్పిన భార్య భర్త ఇద్దరు పిల్లలు జీవించుటకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని శ్రమ దోపిడీ పనికిరాదని చెప్పిన మాటలను ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాస రావు, ఉలవల పూడి రాము, బూదాల చిన్న, సంపెంగుల రాజు, పి.ఏసు, రాజపూర్ ఎస్ పాదం, కోటేశ్వరరావు మున్సిపల్ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమాలకు మాతృక ఎస్టీయూ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఉపాధ్యాయ ఉద్యమాలకు మాతృక ఎస్టీ యూ అని ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి కే కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చిలకలూరిపేట మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల సంక్షేమం పాటశాలలో పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన ఏకైక సంఘం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ అన్నారు. గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు ఉద్యమాలు పోరాటాల ద్వారా సాధించామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పేస్కేల్స్ మంజూరు, పీఆర్సీ సాధనలో, అప్రెంటిస్ రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్ సాధన, తదితర అనేక రకాల ఉద్యమాలు చేసిన సంఘం ఎస్టీయూ అని అన్నారు. జిల్లా కార్యదర్శి పి వి భీష్మా రావు మాట్లాడుతూ ఎస్టీయూ అంటే సర్వీస్ త్రూ యూనియన్ అని అర్థం అని అన్నారు. మున్సిపల్ మండల, జిల్లా పరిషత్, కస్తూరిభాగాంధి, మోడల్ స్కూల్స్ అన్ని కేటగిరీల పాఠశాలలు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, జిల్లా కౌన్సిలర్ బొంత రవి, పాల్గొన్నారు.

సేవా సహృదయ దాత పారేపల్లి

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న పారేపల్లి మహేష్.. రేవేంద్రపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన వంతెనపైన నిత్యం విపరీతమైన రద్దీతో స్కూల్ బస్సులు ట్రాక్టర్లు, మోటార్ సైకిల్, లారీలు ప్రతిరోజు భయంతో ప్రయాణిస్తున్నారు. స్థానికులు చాలాసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసిన ఈరోజు వరకు పరిశీలించి వెళ్లడమే తప్ప తాత్కాలికంగా గాని శాశ్వతంగా గాని మరమ్మతులు జరగలేదు. అది తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ గురువారం వెదురు బొంగులతో గోడ విరిగిన చోట గోడ కట్టించారు. అధికారులు దీనిపై దృష్టి సారించి శాశ్వత నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు వుడతా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, పట్టణ అధ్యక్షులు మండ్రు సత్యనారాయణ, జాకీర్, మాదు వెంకటేశ్వరరావు, మాదు నాగదుర్గ, సునీత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నీతి నిజాయితీలకు నిదర్శనం నడింపల్లి నరసింహారావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్వాతంత్ర్య సమరయోధులు, గుంటూరు పురపాలక సంఘం ప్రప్రధమ చైర్మన్ నడింపల్లి నరసింహారావు నీతి నిజాయితీలకు, నిబద్ధతకు మరోపేరుగా నిలిచారని మేధావుల ఫోరం కన్వీనర్ పీఎస్ మూర్తి కొనియాడారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాల యంలో గుంటూరు కేసరి నడింపల్లి నరసింహారావు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పీఎస్ మూర్తి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమరచరిత్రలో బ్రిటీష్ వారిని ఎదిరించి నాటి మున్సిపల్ భవనంపై త్రివర్ణ పతాకను ఎగురవేసిన బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన మహా సాహసి నడింపల్లి అని కొనియాడారు. ఈ వేడుకల్లో ఘనశ్యామాచార్యులు, కొండా శివరామిరెడ్డి, కమలాకాంత్, ఏవీకె సుజాత, కన్న మాష్టార్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వ తాతలకు అండగా సీఎం జగన్ : ఎమ్మెల్యే పీఆర్కే

విశాలాంధ్ర-మాచర్ల: పెన్షన్‌ను రు.3వేలకు పెంచుతూ అవ్వ తాతలకు ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత సీఎం కే దక్కిందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వృద్ధులకు పెన్షన్ కానుక ఉత్సవాలలో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్ కే దక్కిందన్నారు. నాటి చంద్రబాబు పాలనలో కేవలం రు.2వేల తోనే కాలం గడిపాడన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రాష్ట్ర అభివృద్ధికి జగన్ పాటుబడినట్లు ఆయన పేర్కొన్నారు.. జగన్ పాలనలో రాష్ట్రంలో లబ్ధి చేకూరని ఇల్లు లేదని, రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ కు అండగా ఉండి తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు జనవరి నెల పెన్షన్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిదె మంగమ్మ, జడ్పిటిసి సభ్యులు మల్లు స్వామి, బూడిదె శ్రీనివాసరావు, సైదులు, కుర్రి సాయి మార్కొండా రెడ్డి, తాడి వెంకటేశ్వర్ రెడ్డి, ఎర్రబోతుల శ్రీనివాసరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సరోజినీ దేవి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు హనుమంతరావు మృతి

- సీపీఐ నాయకులు నివాళి

విశాలాంధ్ర-నాదెండ్ల: సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, రైతు సంఘ నేత పర్వతనేని హనుమంతరావు(80) గురువారం మృతి చెందారు. ఆయన మరణ సమాచారం తెలుసుకున్న సీపీఐ నాయకులు మండలంలోని ఎండుగంపాలెంలోని ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పార్టీ పతకాన్ని పార్థీవదేహంపై కప్పి, పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కమ్యూనిస్టుపార్టీకి, రైతు సంఘం తరుపున ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పేలూరి రామారావు, దాసరి వరహాలు ఉన్నారు.

పోలీసు అధికారులు వైసీపీ కార్యాలయానికి వెళ్లి శుభాకాంక్షలు తెలపటం సిగ్గు చేటు

- ప్రత్తిపాడు టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రామాంజనేయులు

విశాలాంధ్ర-గుంటూరుకార్పొరేషన్: ప్రత్తి పాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్‌ను డిఎస్పీ స్థాయి నుండి ఎస్సై స్థాయి వరకు పోలిసు అధికారులు కట్టకట్టుకుని వెళ్లి వైసీపీ పార్టీ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపటం పోలిసు శాఖకే సిగ్గుచేటని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి బుర్ల రామాంజనేయులు అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ నియమించిన సమన్వయకర్తను పోలిసు అధికారులు విధి నిర్వహణ సమయంలో కలవడం, కేక్ కట్ చేసి అభినందనలు తెలపడంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. సమన్వయకర్త ఏ చట్టం మేరకు పోలిసు అధికారులకు బాస్ అయ్యాడో చెప్పాలన్నారు. జనవరి 10వ తేదీ వరకు ఎన్నికల ప్రక్రియకు చెందిన నియమ నిబంధనలు అమలులో ఉండగా.. వాటిని తుంగలో తొక్కి ఎవరి ఆదేశాలతో పార్టీ కార్యాలయంలో సమన్వయ కర్తను కలిసారో ప్రజలకు సమాధానం చెప్పాలని, ఈ సంఘటనను పోలిసు శాఖ ఏ విధంగా సమర్థించుకుంటుందో ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ఇది పూర్తిగా సిసిఐ రూల్స్‌కి విరుద్ధం.. ఈ అధికారులను వెంటనే సస్పెండ్ చేసి ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్నారు. పోలీసులు రాష్ట్రంలో నిష్పక్షపాతంగా ఉన్నారని చెప్పడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో పోలిసు వ్యవస్థ ఎంత పక్షపాత ధోరణితో వుందో ఈ సంఘటనతో తేటతెల్లమవుతుం దన్నారు. నక్కల అగస్టీన్, నాగిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

విశాలాంధ్ర-తెనాలి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమము ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తెనాలి పురపాలక సంఘ కమిషనర్ మేడికొండ జశ్వంత్‌రావు అన్నారు. స్థానిక చెంచుపేటలోని సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండవ విడత గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల, డాక్టర్ వూరిబిండి మహిత, డాక్టర్ బొర్రా భవితసాయి, డాక్టర్ టి.వినీల్ పాల్గొనగా జనరల్ ఓపీ 16 మంది, గైనకాలజి ఓపీ 27 మంది, జనరల్ మెడిసిన్ ఓపీ 105 మంది, ఆప్తోమెట్రీషియన్ ఓపీ 93 మందిని పరీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని 28వ వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్ పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. డీపీఎంఓ జంగం శ్యామ్, యూఎల్బీ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్ మల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ నవీద్, సచివాలయ అడ్మిన్ పి.సందీప్, హెల్త్ విజిటర్ దాసరి విజయకుమారి, పాగోలు వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీకి క్యాలెండర్

విశాలాంధ్ర వినుకొండ టౌన్ : ఏపీ. ఆర్టీసీ ఎండీ. ద్వారకా తిరుమలరావు గారికి. నూతన సంవత్సరం 2024 విశాలాంధ్ర డైరీ, క్యాలెండర్‌ను అందజేస్తున్న పల్నాడు జిల్లా విశాలాంధ్ర విలేఖరి యార్లగడ్డ చంద్రశేఖర్ ఆజాద్. ఈ సందర్భంగా ఎండీ. అభినందిస్తూ, విశాలాంధ్రతో కొద్దిసేపు ముచ్చటించారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో గత ఏడాది నవంబర్ నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్ళు కోల్పోయిన బాధిత కుటుంబమునకు గురువారం ఆంధ్రప్రదేశ్ హరిదాసు అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమం జరిగింది. అగ్ని ప్రమాదంలో ఇళ్ళు కోల్పోయిన బాధితులు పంబా వెంకటేశ్వర్లు కుటుంబమునకు ఆంధ్రప్రదేశ్ హరిదాసు అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మెండెం లక్ష్మణ్ రూ.10వేలు అందజేశారు.ఆంధ్రప్రదేశ్ హరిదాసు అభివృద్ధి సంక్షేమ సంఘం నాయకులు నాగమల్లేశ్వరరావు, పంబా వెంకట్, కుల పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-మాచర్ల: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను ఆదుకోవడంలో సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, టీడీపీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంసీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్రహం లింకన్ అన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని వారం రోజులుగా పట్టణంలోని కార్యాలయం ముందు చేస్తున్న నిరసనకు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కుటుంబం వెళ్లదీస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ గ్రాడ్యుటీ ఇవ్వాలని, కనీస వేతనంగా నెలకు రు.26 వేల రూపాయలు జీతం, కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ టౌన్ సెక్రటరీ మిద్దె పోగు బాబురావు, కార్మికులు ఆలేటి సంపూర్ణ, బత్తుల కోటేశ్వరమ్మ , లక్ష్మమ్మ అన్నమ్మ, సంతోషమ్మ, నాగరాజు, కుమార్, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

విశాలాంధ్ర-అమరావతి : రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కి పూర్వ వైభవం రానున్నట్లు పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి అన్నారు. మండల పరిధిలోని దిడుగు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యూత్ జో డో బూత్ జో డో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పురవీధులలో తిరుగుతూ యువకులకు రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ రావలసిన ఆవశ్యకతను, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వడం ద్వారా దేశంలోని బలహీన వర్గాల గొంతుకై ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడతారని అన్నారు. నేడు వైఎస్ షర్మిల రాకతో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పర ఉదయ్ శంకర్, కత్తుల గణేష్, శివాజీ, వెంకట్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు: అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు జరపాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు కొల్లి లక్ష్మీనరసింహ సామ్రాజ్యం జ్యోతి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పెద్దకూరపాడులో తాసిల్దార్ కార్యాలయం వద్ద గురువారం వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖానికి ముసుగు వేసుకొని ఉరి తీయండి ... సమస్యను పరిష్కరించండి అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తూ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్రవంతి రాణి, మేరి వెంకాయమ్మ, నాగరాజా, షేకే హిమాభి, నాగేంద్రం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-చిలకలూరిపేట: న్యాయమైన మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ విమర్శించారు. ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చిలకలూరిపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గురువారం కూడా రెండో రోజు మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ ధర్నా కార్యక్రమం ను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ మోహనరెడ్డి పాదయాత్రలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరునెలల లోపు పర్మినెంట్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతా.. మల్లెల రాజేష్‌నాయుడు

కార్మికుల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సమయంలో కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వం పెంచిన పెన్షన్ల అందజేత కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్లే క్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మున్సిపల్ కార్మికుల ధర్నా వద్దకు చేరుకున్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, సీపీఐ నాయకులు, కార్మికుల సంఘ నాయకులను అడిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, స్థానికంగా మున్సిపల్ కార్మికులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోమరగిరి చెంచయ్య,కార్యదర్శి యోగయ్య, సీఐటీయూ నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పేలూరి రామారావు, దాసరి వరహాలు, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు నాయుడు శివకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవుల పోతురాజు, పెద్ద నాగేశ్వరరావు, పి అక్కులయ్య, జయరామ్, బాలస్వామి, సురేష్, అంజయ్య, వై నారాయణ, మార్తమ్మ,లక్ష్మి, అంకమ్మ,తిరుపతయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.